




Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక








మంగళవారం 03-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 264 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


# బడ్జెట్ ముంగిట దేవాదుల
## నిధుల వరద పారేనా?




మిగతాది 2 లో

- గోదావరి వరద జలాలతో ఎత్తైన ప్రాంతాలకు నీటి లక్ష్యం
- 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మహత్తర ప్రణాళిక
- భూసేకరణ, సాంకేతిక అడ్డంకులతో నెమ్మదించిన పనులు
- రూ.6,016 కోట్ల నుంచి రూ.18,500 కోట్లకు పెరిగిన వ్యయం
- 91% పనులు పూర్తి.. మిగిలిన 9%కు రూ.4,312 కోట్లు అవసరం
- నిధుల ఆలస్యం పెంచుతున్న ఆర్థిక భారాలు
- సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షతో కొత్త ఆశలు
- బడ్జెట్ కేటాయింపులపైనే రైతులు, రాజకీయ వర్గాల దృష్టి

**న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం):**

తెలంగాణలో గోదావరి జలాలను ఎత్తైన ప్రాంతాలకు అందించాలనే మహత్తర లక్ష్యంతో ప్రారంభమైన దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరోసారి బడ్జెట్ సీజన్‌లో చర్చల కేంద్ర బిందువుగా మారింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఎత్తిపోతల పథకం ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడం రైతుల్లో తీవ్ర నిరాశకు దారితీస్తున్నది. ఏటా బడ్జెట్ సమయంలో భారీ కేటాయింపులపై హామీలు వినిపిస్తున్నా.. పనుల పురోగతి మాత్రం ఆశించినంత వేగంగా సాగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి నదిలో లభ్యమయ్యే వరద జలాలను వినియోగించి వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి వంటి ఎత్తైన జిల్లాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. నీటిని పలు దశల్లో ఎత్తిపోతల ద్వారా పైభాగాలకు తరలించే విధంగా రూపకల్పన చేసిన ఈ పథకం సాంకేతికంగా క్లిష్టమైనది. భారీ పంప్ హౌసులు, సుదీర్ఘ పైప్‌లైన్లు, కాల్వల నిర్మాణం, పంపిణీ వ్యవస్థలతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలలో ఇది ఒకటి.

## ట్రంప్‌తో చర్చలకు సహకరించే ప్రసక్తే లేదు
### ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ క్లారిటీ



2 లో

## చంద్రగ్రహణం.. నేడు ఆలయాల మూసివేత



2 లో

## నేడు కలెక్టర్లతో సీఎం రేవంత్ కీలక భేటీ..



2 లో

## ఆర్కే రోజా డీఎంకేకు మద్దతు



2 లో

## బుల్డోజర్లతో రంగంలోకి దిగుతా: రేవంత్ సర్కార్‌కు బండి సంజయ్ హెచ్చరిక



2 లో

## విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు రూ.10.79 కోట్ల అక్రమాలు బట్టబయలు



2 లో

## దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త.. ఇక 100 శాతం ఫ్రీ



2 లో

## తెలంగాణలో 'జనగణన' నగారా..
### మే 11 నుంచి ఇళ్ల జాబితా సేకరణ!

- ఆన్‌లైన్ యాప్ ద్వారా పూర్తి సర్వే
- 88 వేల సిబ్బంది వినియోగం
- 621 మండలాలు, 9,983 గ్రామాలు ఆధారం
- హైదరాబాద్లో మాస్టర్ ట్రైనర్ల శిక్షణ
- 2027 ఫిబ్రవరిలో జనగణన రెండో దశ



2 లో

## శబరిమల ఆలయంలో మహిళలకు నో ఎంట్రీ

- ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కీలక నిర్ణయం
- దశాబ్దాల సంప్రదాయాలను కాపాడడం
- సుప్రీంకోర్టు 2018 తీర్పుపై వ్యతిరేకత
- మార్చి 14లో అఫిడవిట్ సమర్పణ
- టీడీబీ సభ్యుల సమర్థన
- దేశవ్యాప్తంగా పునఃసమీక్ష పిటిషన్లు



2 లో

## ధారావిలో 'గరీబీ దర్శన్' వివాదం
### 'అదానీ గ్రూప్' సరికొత్త దందా!




2 లో

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): : ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ అయిన ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్ట్ మరోసారి వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా.. ధారావిలోని పేదరికాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకుల నుంచి భారీగా నిధులు వసూలు చేస్తున్నారని స్థానిక ధారావి నివాసితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

**అసలు వివాదం ఇదే..?**

పర్యాటకుల కోసం నిర్వహిస్తున్న ఈ మురికివాడల పర్యటనలను స్థానికులు 'గరీబీ దర్శన్' అని పిలుస్తున్నారు. ఇందులో ఒక్కో విదేశీ పర్యాటకుని నుంచి సుమారు రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఇది పేదరికాన్ని వ్యాపారంగా మార్చుకోవడమేనని స్థానికులు మండిపడుతున్నారు. తమ కష్టాలను, జీవన పరిస్థితులను ప్రపంచానికి చూపిస్తూ లాభాలు గడించడం అనైతికమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**స్థానికుల ఆవేదన**

రీడెవలప్‌మెంట్ పేరుతో తమను ఖాళీ చేయించడమే కాకుండా, ఇప్పుడు తమ గృహాలను, బతుకుదెరువును పర్యాటక వస్తువులుగా మార్చడాన్ని ధారావి వాసులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిధులు ఎవరికి చేరుతున్నాయి..? ప్రాజెక్ట్ ముసుగులో జరుగుతున్న ఈ పర్యటనలకు అనుమతి ఎవరు ఇచ్చారని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై రాజకీయంగా పలు విమర్శలు వస్తున్న తరుణంలో, ఈ 'స్లమ్ టూర్' వివాదం మరింత ముదిరేలా కనిపిస్తోంది.

## మంత్రులు రావొద్దు.. రాహుల్ పర్యటన వేళ పీసీసీ ఆదేశాలతో మంత్రులు వెనక్కి





2 లో

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం ప్రారంభమైంది. ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ మహేష్ గౌడ్ అధ్యక్షతన పీఏసీ సమావేశం కొనసాగుతోంది. తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాహుల్ గాంధీ టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితిపై పార్టీ నేతలతో చర్చిస్తున్నారు.

## గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలోకి కెనడా..
### స్వాగతించిన ప్రధాని మోదీ

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): భారత్, కెనడా మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్ పర్యటనలో భాగంగా సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఇద్దరు ప్రధానులు మీడియాతో మాట్లాడుతూ.. పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు.

కెనడా గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో, అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆ దేశ ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రకటించారు. కెనడా నిర్ణయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వాగతించారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-కెనడా మధ్య ఆర్థిక సంబంధాలను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్తామని ప్రకటించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ₹50 బిలియన్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని త్వరలోనే ఖరారు చేయాలని ఇరువురు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. భారత వృద్ధిపై నమ్మకంతో కెనడియన్ పెన్షన్ ఫండ్స్ ఇప్పటికే 100 బిలియన్లను మన దేశంలో పెట్టుబడిగా పెట్టాయని మోదీ గుర్తుచేశారు.



2 లో

**వ్యూహాత్మక ఇంధన భాగస్వామ్యం**

క్లీన్ ఎనర్జీ రంగంలో సహకారం కోసం కొత్త భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. గాలి, సౌర మరియు హైడ్రోజన్ శక్తి రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని ప్రకటించారు. 2050 నాటికి తమ విద్యుత్ గ్రిడ్‌ను రెట్టింపు చేయాలన్న కెనడా లక్ష్యంలో భారత్ కీలక భాగస్వామి కానుంది.

## ఇరాన్‌కు మరో బిగ్ షాక్.. అలీ రెజా అరాఫీ హతం?

- అయతుల్లా అలీ ఖమేనీ తర్వాత కలకలం
- ఇజ్రాయెల్ దాడుల ప్రచారం
- అధికారిక స్పందన లేదు
- గంటల్లోనే పరిణామాలు
- యుద్ధ ఉద్రిక్తత పెరుగుతోంది



2 లో

# ఇరాన్‌కు మరో బిగ్ షాక్.. అలీ రెజా అరాఫీ హతం?

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇరాన్‌కు మరో భారీ షాక్ తగిలింది. ఇరాన్ సుప్రం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ బాధ్యతలు తాత్కాలికంగా స్వీకరించిన అలీ రెజా అరాఫీ సైతం హతమైనట్లు తెలుస్తోంది. అరాఫీని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ మేరుక సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే అరాఫీ మరణంపై ఇరాన్ ఇంకా స్పందించలేదు.

గంటల వ్యవధిలోనే:

ఇరాన్ సుప్రీంనేత ఖమేనీ మరణాన్ని ధ్రువీకరించిన వెంటనే ఇరాన్ తమ తాత్కాలిక నాయకత్వాన్ని ప్రకటించింది. ఖమేనీ స్థానంలో తాత్కాలిక సుప్రీం లీడర్ గా అరాఫీ వ్యవహరించనున్నట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. అయితే సుప్రీం లీడర్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటలకే వ్యవధిలోనే ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో అరాఫీ సైతం మరణించారనే వార్తలు యుద్ధరంగంలో ఇప్పుడు మరింత టెన్షన్ పెట్టిస్తున్నాయి. ఈ వార్త ఇప్పుడు టెహ్రాన్ అంతటిని షాక్ కు గురి చేస్తుండగా ఈ యుద్ధంలో ఏం జరుగుతోంది? ఈపరిణాణాలు ఎటువైపు దారి తీస్తాయనే టెన్షన్ ప్రపంచ దేశాలను ఆందోళనలోకి నెట్టుతున్నాయి.

# గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలోకి కెనడా.. స్వాగతించిన ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారం

రక్షణ రంగంలో సంబంధాలను బలోపేతం చేసేందుకు 'డిఫెన్స్ డైలాగ్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనితో పాటు ఏఐ, అంతరిక్ష సాంకేతికత, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లోనూ కొత్త ఒప్పందాలు జరిగాయి. స్పేస్ టెక్నాలజీ, సెక్యూరిటీ రంగాల్లో కూడా లోతైన సహకారం ఉంటుందని కెనడా ప్రధాని కార్నీ స్పష్టం చేశారు. అలాగే భారత్‌లో కెనడియన్ విశ్వవిద్యాలయాలు, తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు కూడా ఒప్పందం చేసుకున్నారు. ఇరు దేశాల్లోని ఆదివాసీ, గిరిజన వర్గాల సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకునేందుకు ఒక అవగాహన ఒప్పందం కుదిరింది.

భారత ఆర్థిక వ్యవస్థపై కార్నీ ప్రసంశలు

భారత ఆర్థిక వ్యవస్థపై మార్క్ కార్నీ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందన్నారు. భారతీయుల తలసరి ఆదాయం పెరిగిన వేగం మానవ చరిత్రలోనే అరుదైనదిగా చెప్పారు. 2023లో జరిగిన భారత జి20 అధ్యక్షతన ఉన్న 'వసుదైక కుటుంబం' థీమ్ ప్రస్తుత ప్రపంచ సవాళ్లకు సరైన పరిష్కారమని ఆయన పేర్కొన్నారు.

గడిచిన ఏడాది కాలంలో భారత్, కెనడా ప్రభుత్వాల మధ్య జరిగిన చర్చలు, గత రెండు దశాబ్దాలలో జరిగిన మొత్తం చర్చల కంటే ఎక్కువ అని తెలిపారు. ఇది కేవలం పాత సంబంధాల పునరుద్ధరణ మాత్రమే కాదని, ఒక 'నవశకానికి నాంది' అని ఆయన అభివర్ణించారు.

# ట్రంప్‌తో చర్చలకు సహకరించే ప్రసక్తే లేదు ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ క్లారిటీ



న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): ఇజ్రాయెల్ – అమెరికా కలిసి టెహ్రాన్ పై చేసిన దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికా, ఇజ్రాయెల్ దేశాలపై ప్రతీకారం కచ్చితంగా తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించింది. నిన్నటి నుంచి మూడు దేశాల మధ్య యుద్ధం మరింత తీవ్రమయింది. అలాగే గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇక తాజాగా.. ఇరాన్ ట్రంప్ తో చర్చలకు ట్రై చేస్తున్నట్లు వార్తలు రాగా.. వాటిని ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ఒక పోస్ట్ చేశారు.

ఇజ్రాయెల్ అధికార దాహం కోసం.. అమెరికాతో తాము చర్చలు జరుపుతున్నట్లు వస్తున్న వార్తలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా దాడుల్లో సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత, మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామనే రిపోర్టులను ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీ కొట్టిపారేశారు. ట్రంప్ తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలే ప్రాంతీయ అస్థిరతకు కారణమని లారిజానీ విమర్శించారు. ట్రంప్ తన అమెరికా ఫస్ట్ అనే నినాదాన్ని ఇజ్రాయెల్ ఫస్ట్ గా మార్చేశారని ఆరోపించారు. ఇజ్రాయెల్ అధికార దాహం కోసం అమెరికా సైనికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారని మండిపడ్డారు. "మేము ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదు.. కానీ దురాక్రమణను సహించబోము" అని ఆయన స్పష్టం చేశారు.

ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ఆగదు

ఇరాన్‌లో కొత్త నాయకత్వంతో చర్చలు జరిపేందుకు ట్రంప్ సిద్ధంగా ఉన్నారని వైట్ హౌస్ అధికారులు పేర్కొన్నారు. అయితే.. చర్చల ప్రతిపాదనలు పక్కన పెడితే.. ప్రస్తుతం కొనసాగుతున్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మాత్రం ఆగదని అమెరికా స్పష్టం చేసింది. ఖమేనీ మరణానంతరం ఇరాన్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కూడిన తాత్కాలిక మండలి ప్రస్తుతం సుప్రీం లీడర్ బాధ్యతలను నిర్వహిస్తోంది.

కొనసాగుతున్న క్షిపణి దాడులు..మరోవైపు ఇరాన్ తన ప్రతీకార దాడులను ఉధృతం చేసింది. సోమవారం ఉదయం ఇరాన్ మధ్య భాగం నుండి శత్రువుల స్థావరాలే లక్ష్యంగా భారీగా క్షిపణులను ప్రయోగించినట్లు అక్కడి ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మరోవైపు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దళం పట్టు సాధించింది. భద్రత, నిఘా, సైనిక కమాండ్ సెంటర్లపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్‌తో పాటు దోహా, దుబాయ్, జెరూసలేంలలో భారీ పేలుళ్లు సంభవించాయి. కువైట్ తన గగనతలంలోకి వచ్చిన డ్రోన్లను కూల్చివేసింది. సైప్రస్‌లోని బ్రిటన్‌కు చెందిన ఆర్ఏఎఫ్ అక్రోతిరి బేస్‌పై డ్రోన్ దాడి జరిగింది.

# నేడు కలెక్టర్లతో సీఎం రేవంత్ కీలక భేటీ..

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): సచివాలయం వేదికగా రేపు సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం అమలుపై ఈ సమావేశంలో కలెక్టర్లకు సీఎం స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా ఈ నెల మార్చి 6 నుంచి జూన్ 12 వరకు మొత్తం 99 రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగనుంది. ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల పంపిణీ, క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ఈ ప్రణాళిక యొక్క ప్రధాన ఉద్దేశంగా పెట్టుకున్నారు.

కలెక్టర్లకు సీఎం సూచనలు..

99 రోజుల కాలంలో జిల్లాల వారీగా యంత్రాంగం ఎలా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించనున్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై సమీక్షించనున్నారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం, స్థానిక అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించడంపై డిస్కస్ చేయనున్నారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణా రావు, వివిధ శాఖల మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులు పాల్గొని, జిల్లాల వారీగా ఉన్న ప్రగతి నివేదికలను పరిశీలించనున్నారు.

# మంత్రులు రావొద్దు.. రాహుల్ పర్యటన వేళ పీసీసీ ఆదేశాలతో మంత్రులు వెనక్కి

మొదటి పేజీ తరువాయి

పీఏసీ సమావేశం అనంతరం డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. డీసీసీలకు శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా రాహుల్ గాంధీ రావడంతో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రులు సైతం అనంతగరికి చేరుకున్నారు. అయితే డీసీసీ శిక్షణా తరగతులకు మంత్రులకు రావద్దని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఖరాఖండీగా చెప్పేశారు. దీంతో చేసేదేమి లేక రాహుల్ గాంధీ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి వికారాబాద్ కు వచ్చిన పలువురు మంత్రులు తిరిగి వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరివెళ్లిపోయారు.

# ధారావిలో 'గరీబీ దర్శన్' వివాదం 'అదానీ గ్రూప్' సరికొత్త దందా!

మొదటి పేజీ తరువాయి

రీడెవలప్‌మెంట్‌పై అనుమానాలు..

ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ కింద తమకు లభించే ఇళ్ల విస్తీర్ణంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 2000 సంవత్సరం కంటే ముందు ఉన్నవారికే ఉచిత ఇళ్లు ఇస్తామన్న నిబంధనపై కూడా ఆగ్రహం ఉంది. మరోవైపు మహారాష్ట్రలోని ప్రతిపక్ష పార్టీ అయిన ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన ఈ ప్రాజెక్టను ప్రపంచంలోనే అతిపెద్ద టీడీఆర్ స్కామ్‌గా అభివర్ణిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ 'స్లమ్ టూరిజం' వివాదం ప్రజల్లో మరింత అపనమ్మకాన్ని పెంచుతుండగా.. ప్రభుత్వంపై అదానీ గ్రూప్‌ను ప్రధాన ప్రతిపక్షం అస్త్రంగా వాడుకుంటోంది.

# తెలంగాణలో 'జనగణన' నగారా.. మే 11 నుంచి ఇళ్ల జాబితా సేకరణ!

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): జనగణనలో మొదటి దశ అయిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరంగా కేబినెట్‌లో హౌస్ లిస్టింగ్ తేదీలను ఖరారు చేయడంతో మార్గం సుగమం అయింది. మే 11 నుంచి జూన్ 9 వరకు ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జనాభా గణన జరుగుతుండగా దేశవ్యాప్తంగా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో యాప్ ద్వారా చేస్తున్నారు. ఇందుకు 88 వేల సిబ్బంది అవసరం అవుతారని అంచనా వేశారు. 2025 డిసెంబర్?31 నాటికి రాష్ట్రంలో 621 గ్రామీణ మండలాలు, 9,983 రెవెన్యూ గ్రామాలు, 134 పట్టణాలు ఉన్నాయని గుర్తించారు. వీటిని ప్రాతిపదికన తీసుకొని జనాభా లెక్కలు చేయనున్నారు. పట్టణాల్లో కంటోన్‌మెంట్, జీహెచ్ఎంసీ పరిధిలోని సర్కిల్స్‌ను లెక్కలోకి తీసుకున్నారు. వీటన్నంటికీ కోడ్ కేటాయించి వాటి ద్వారా ఎన్యూమరేటర్లతో సర్వే చేయనున్నారు. ఇందుకు గ్రామస్థాయిలో టీచర్లతో సహా అందుబాటులో ఉన్న అన్ని శాఖల సిబ్బంది, ఉద్యోగులను వినియోగించుకుంటారు. సిబ్బందిని గుర్తించే పనిని జిల్లా కలెక్టర్‌లకు అప్పగించారు.

గ్రామం, పట్టణాల్లో వార్డులు యూనిట్‌గా..

హౌస్ లిస్టింగ్ సర్వేపై జాతీయ స్థాయి శిక్షణ పూర్తి కాగా 66 మంది మాస్టర్ ట్రైనర్లకు మార్చి 5 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వబోతున్నారు. త్వరలోనే జిల్లా కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పించనున్నారు. అలాగే ఫీల్డ్?లెవల్‌లో 1,220 మంది వివిధ విభాగాల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తంగా ఏప్రిల్ కల్లా శిక్షణలన్నీ పూర్తి చేయనున్నారు. జనాభా లెక్కల్లో రెవెన్యూ గ్రామాన్ని, పట్టణాల్లో వార్డులను ఒక యూనిట్‌గా తీసుకోనున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 800 జనాభా ఉన్న ప్రాంతాన్ని అప్పగించనున్నారు. టెక్నాలజీపై అవగాహన లేనివారిపై ప్రత్యేక దృష్టి పెట్టి శిక్షణ ఇవ్వనున్నారు. కాగా హౌస్ లిస్టింగ్ అనంతరం 2027, ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జనగణన ప్రక్రియ జరుగనుంది.

# చంద్రగ్రహణం.. నేడు ఆలయాల మూసివేత

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): నేడు ఏర్పడనున్న పాక్షిక చంద్రగ్రహణం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాలు మూతపడనున్నాయి. ఖగోళ శాస్త్రం, హిందూ ధర్మశాస్త్రం ప్రకారం గ్రహణ సమయంలో ఆలయాలను మూసివేసి, గ్రహణానంతరం సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, యాదగిరిగుట్ట, మరియు వేములవాడ రాజన్న దేవాలయాల అధికారులు ఇప్పటికే కీలక ప్రకటనలు విడుదల చేశారు. గ్రహణం ప్రారంభానికి కొన్ని గంటల ముందే ఆలయ గర్భాలయ ద్వారాలను మూసివేస్తున్నట్లు, ఆ సమయంలో భక్తులకు దర్శనాలు సహా అన్ని రకాల కైంకర్యాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.నేడు మధ్యాహ్నం నుండే ఈ ప్రభావం మొదలుకానుండటంతో భక్తులు తమ పర్యటనలను తదనుగుణంగా మార్చుకోవాలని ఆలయ కమిటీలు విజ్ఞప్తి చేస్తున్నాయి. తిరుమలలో గ్రహణం కారణంగా అన్నప్రసాద వితరణ, సర్వదర్శనంలో మార్పులు ఉండనున్నాయి. గ్రహణం ముగిసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేసి, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం తిరిగి భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు.

# బుల్డోజర్లతో రంగంలోకి దిగుతా: రేవంత్ సర్కార్‌కు బండి సంజయ్ హెచ్చరిక

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): గాంధీ విగ్రహం ఏర్పాటు పేరుతో పేదల ఇళ్లు కూల్చి వేయడం దారుణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తే.. పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని బండి సంజయ్ సంచలన వార్నింగ్ ఇచ్చారు. గతంలో అసదుద్దీన్ ఒవైసీ కాలేజీలు కూల్చడానికి విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయంటూ సాకు చెప్పారు. మరి ఖమ్మంలో కూల్చివేతలు చేసే సమయంలో ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, వారి భవిష్యత్ గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీ కళ్లలో ఆనందం కోసం హిందువులను జైల్లో వేస్తారా? అని తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువులంతా ఏకమైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ బయట తిరగలేరని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం మొదలైంది. మూటల కోసం తెలంగాణకు రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని బండి సంజయ్ హాట్ కామెంట్స్ చేశారు.

# దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త.. ఇక 100 శాతం ఫ్రీ

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మాలక్ష్మి పథకం కింద మహిళలలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ఇప్పటికే అమలు చేస్తుండగా తాజాగా రాష్ట్రంలోని దివ్యాంగ పురుషులకూ వంద శాతం ఫ్రీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కాగా ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వర్తింప చేస్తున్నారు. వీరు రాష్ట్రంలోని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో తెలంగాణ సరిహద్దుల లోపు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతర్రాష్ట్ర పల్లె వెలుగు మరియు ఎక్స్‌ప్రెస్ బస్సులలో తెలంగాణ సరిహద్దు వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే తాజాగా దివ్యాంగులకు సైతం ఈ స్కీమ్ అమలు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# బడ్జెట్ ముంగిట దేవాదుల.. నిధుల వరద పారేనా?

మొదటి పేజీ తరువాయి

లక్ష్యం 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు..

ప్రాజెక్టు ద్వారా సుమారు 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం కొన్ని సమీప ప్రాంతాలకు మాత్రమే నీరు అందుతుండగా, మిగిలిన ఎత్తైన మండలాల రైతులు ప్రాజెక్టు పూర్తవడం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వర్షాధార వ్యవసాయం ప్రధానంగా ఉండటంతో, దేవాదుల నీరు అందితే రెండో పంట వేసే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సాగునీరు అందడం వల్ల భూగర్భ జలాల స్థాయి మెరుగుపడుతుంది. దేవాదుల ప్రాజెక్టు ఆలస్యానికి పలు కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా భూసేకరణ సమస్యలు పనులను గణనీయంగా ప్రభావితం చేశాయి. మూడో దశలో అవసరమైన భూముల సేకరణ పూర్తికాకపోవడంతో పైప్‌లైన్, పంపిణీ వ్యవస్థ పనులు నిలిచిపోయాయి. అదనంగా సాంకేతిక ఇబ్బందులు, కాంట్రాక్టు మార్పులు, నిధుల కొరత వంటి అంశాలు కూడా పనుల వేగాన్ని తగ్గించాయి. గత నాలుగేళ్లుగా కీలక దశలో పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

మూడు రెట్లు పెరిగిన వ్యయం..

ప్రారంభంలో రూ.6,016 కోట్ల అంచనాతో ఆమోదం పొందిన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం సుమారు రూ.18,500 కోట్లకు చేరుకుంది. అంటే దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఆలస్యం కారణంగా నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడం, భూసేకరణ ఖర్చులు అధికమవడం, సాంకేతిక మార్పులు చేయాల్సి రావడం, విద్యుత్ ఖర్చులు పెరగడం వంటి అంశాలు వ్యయాన్ని గణనీయంగా పెంచాయి. ఇప్పటివరకు రూ.14,188 కోట్లు ఖర్చు చేసి సుమారు 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 9 శాతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.4,312 కోట్లు అవసరమని ఇరిగేషన్ శాఖ అంచనా వేస్తున్నది. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రాజెక్టు జాప్యం కొనసాగితే భవిష్యత్తులో అంచనాలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నది. నిధుల విడుదల ఆలస్యమైతే కాంట్రాక్టు సవరణలు, ధరల పెరుగుదల కారణంగా మరోసారి వ్యయభారం పెరిగే అవకాశం ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు.

సీఎం సమీక్ష.. కొత్త ఆశలు..

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. భూసేకరణకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. సీఎం స్థాయిలో సమీక్ష జరగడం ప్రాజెక్టు పురోగతికి మేలు చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే.. రైతులు మాత్రం ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు వినిపిస్తున్నాయని, ఆచరణలో మాత్రం పనులు మందగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌పైనే అందరి దృష్టి..

ప్రస్తుతం అందరి దృష్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పైనే కనిపిస్తున్నది. మిగిలిన పనులు పూర్తి చేయాలంటే తక్షణమే రూ.4,312 కోట్ల విడుదల అవసరమని ఇంజినీరింగ్ వర్గాలు సూచిస్తున్నాయి. ఒకేసారి పూర్తిస్థాయి నిధులు విడుదల చేస్తేనే పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉన్నదని వారు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే పరిమిత కేటాయింపులతో మరోసారి జాప్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 91 శాతం పనులు పూర్తయిన ఈ ప్రాజెక్టు చివరి దశలో నిలిచిపోవడం రాష్ట్రానికి కూడా ఆర్థిక భారంగా మారుతున్నది. పూర్తికాని ప్రాజెక్టుపై ఇప్పటికే భారీగా ఖర్చు చేయడం వల్ల ఆర్థిక ఒత్తిడి పెరుగుతున్నదని విశ్లేషకులు అంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో పూర్తిస్థాయి కేటాయింపులు చేసి ప్రాజెక్టును పూర్తిచేస్తారా? లేక మరోసారి పరిమిత నిధులతో సరిపెడతారా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో, రైతుల్లోనూ చర్చనీయాంశమైంది.

# ఆర్కే రోజా డీఎంకేకు మద్దతు

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): : తమిళనాడులో డీఎంకే మద్దతుగా వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రచారం చేస్తుంది. సీఎం ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలు స్టాలిన్ అందిస్తున్నారు.. ప్రతి నెలా వెయ్యి రూపాయల మహిళలకు నేరుగా అకౌంట్ లో వేయడం గొప్ప పథకం.. దాని వల్ల మహిళల ఆర్థిక భద్రత పెరుగుతుందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరుగా మహిళలకు డబ్బులు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి రెండేళ్లు అయినా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శలు గుప్పించింది. అయితే, ఎంకే స్టాలిన్ ఒకేసారి ఐదు వేల రూపాయలు మహిళ అకౌంట్ లో వేయడంతో మిగిలిన పార్టీ నేతలందరికి పిచ్చి పట్టింది అంటూ ఆర్కే రోజా మండిపడింది. స్టాలిన్ ను మరోసారి తమిళ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి అని కోరింది. మహిళలకు ఫ్రీ బస్సు నేను సపోర్ట్ చేస్తాను.. ఉచిత బస్సు వల్ల మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ప్రతి నెలా కొంత డబ్బును ఫ్రీ బస్సు వల్ల మహిళలు పొందుతున్నారు.. పనులకు వెళ్ళేవారికి ఫ్రీ బస్సు ఎంతో ఉపయోగంగా ఉండనుంది. ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న స్టాలిన్ పార్టీని గెలిపించి తమిళ ప్రజలు రుణం తీర్చుకోవాలని మాజీమంత్రి ఆర్కే రోజా వెల్లడించింది.

# విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు.. రూ.10.79 కోట్ల అక్రమాలు బట్టబయలు

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులు, అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు 2026, ఫిబ్రవరి నెలలో రవాణా, జీఎస్టీ, గనులు, అటవీ, పోలీస్ శాఖలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో భారీగా అక్రమాలను గుర్తించినట్లుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలను తనిఖీ చేయగా, వివిధ నిబంధనల ఉల్లంఘనల కింద 200 వాహనాలను సీజ్ చేసినట్లుగా తెలిపారు. స్పెషల్ రెయిడ్స్‌లో భాగంగా 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పాల్గొన్న 6 ఎక్స్‌కవేటర్లు, 15 ట్రాక్టర్లు సహా మొత్తం 24 వాహనాలను జప్తు చేసి, 19 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం దారి మళ్లింపుపై జరిపిన తనిఖీల్లో సుమారు 5.8 లక్షల విలువైన 131 క్వింటాళ్ల బియ్యం, 27 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్కడి లోపాలను సరిదిద్దాల్సిందిగా సంబంధిత శాఖలకు నివేదించారు.

ఈ ఒక్క నెలలో నిర్వహించిన ఆపరేషన్లతో ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి పడినట్లుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెండ్ డిపార్ట్‌మెంట్ తేల్చింది. అందులో ఇప్పటి వరకు రూ.1.96 కోట్లను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేసినా.. అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలియజేయాలని విజిలెన్స్ విభాగం సూచించింది.

# శబరిమల ఆలయంలో మహిళలకు నో ఎంట్రీ

న్యూస్ డెస్క్, 02 మార్చి (ఇది కద నిజం): కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం లో శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారాలను, సంప్రదాయాలను కాపాడేందుకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలనే తాము సమర్థిస్తున్నామని, మహిళల ప్రవేశంపై పాత ఆచారాలే కొనసాగాలని బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు మార్చి 14లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని సోమవారం (మార్చి 2) జరిగిన సమావేశంలో నిర్ణయించారు. గతంలో 2018లో సుప్రీంకోర్టు మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ ఇచ్చిన తీర్పును బోర్డు ఇప్పుడు వ్యతిరేకిస్తోంది. దీనిపై టీడీబీ సభ్యులు మాట్లాడుతూ.. మండలిలో ఈ విషయంలో ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవు. దేవాలయం యొక్క పవిత్రతను, పురాతన సంప్రదాయాలను కాపాడటమే బోర్డు ప్రాథమిక బాధ్యత. అందుకే మేము సుప్రీంకోర్టులో గత తీర్పును సవాలు చేస్తూ అఫిడవిట్ సమర్పిస్తాము," అని వివరించారు. 2018లో శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. అయితే, ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో పాటు పలు పునఃసమీక్ష పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ పిటిషన్లు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. ఈ క్రమంలో టీడీబీ తన పాత వైఖరిని మార్చుకుని, సంప్రదాయాలకే మొగ్గు చూపడం గమనార్హం.





# హైదర్‌గూడ 'గోల్డెన్ ప్యాలెస్' హోటల్‌లో
# జీహెచ్ఎంసీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ఇది కద నిజం ,రాజేంద్రనగర్: ప్రజల ఆరోగ్యమే పరమావధిగా జీహెచ్ఎంసీ అధికారులు తమ తనిఖీలను ముమ్మరం చేశారు. అత్తాపూర్ సర్కిల్-20 పరిధిలోని హైదర్‌గూడ, పిల్లర్ నంబర్ 143 సమీపంలో ఉన్న గోల్డెన్ ప్యాలెస్ హోటల్‌ను అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సర్కిల్ డిప్యూటీ కమిషనర్తో పాటు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సౌమ్య రెడ్డి పాల్గొని హోటల్‌లోని పరిస్థితులను సమీక్షించారు.

నమూనాల సేకరణ - ల్యాబ్‌కు తరలింపు: తనిఖీల్లో భాగంగా హోటల్‌లోని వంటశాల, ఆహార పదార్థాల నిల్వ పద్ధతులు మరియు పరిసరాల శుభ్రతను అధికారులు నిశితంగా పరిశీలించారు. ఆహార నాణ్యతపై అనుమానం రావడంతో, పలు రకాల ఆహార నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సౌమ్య రెడ్డి తెలిపారు. ల్యాబ్ నుండి వచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరించే ఏ హోటల్ యాజమాన్యాన్నైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని డిప్యూటీ కమిషనర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రతి హోటల్ ఖచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని, వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు హోటల్ సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
### : శుభప్రద్ పటేల్ డిమాండ్



ఇది కద నిజం, వికారాబాద్ :తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు గతంలో ఇచ్చిన హామీలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. అమరుడు మహేందర్ రెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారి త్యాగాలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి తగిన గౌరవం అందించాలని సూచించారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20 శాతం వాటా కల్పించాలని, అలాగే ప్రతి నెలా గౌరవ వేతనం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు మరియు అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం స్పందించి, పెండింగ్‌లో ఉన్న హామీలను నెరవేర్చాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఉప్పరపల్లిలోని రెసిడెన్షియల్ జోన్‌లో
# అక్రమ 'కార్ వాష్' సెంటర్

**అనుమతులు లేవు, నిబంధనలు అసలే లేవు, కాలనీలో వెలుస్తున్న అక్రమ సర్వీసింగ్ సెంటర్**



ఇది కద నిజం , ఉప్పరపల్లి: రాజేంద్రనగర్ పరిధిలోని ఉప్పరపల్లి, సన్‌రైజ్ హోమ్స్ కాలనీ (రోడ్ నంబర్ 3 ఎక్స్‌టెన్షన్) లో నివాసాల మధ్య వెలుస్తున్న అక్రమ వాణిజ్య కార్యకలాపాలపై స్థానిక నివాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న ఈ నివాస ప్రాంతంలో, నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని ఒక ప్లాట్ యజమాని, గతంలో రేకుల షెడ్లు వేసి అద్దెకు ఇచ్చేవారని, అయితే ఇప్పుడు ధనార్జనే ధ్యేయంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కార్/బైక్ వాషింగ్ మరియు రిపేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల నివాస ప్రాంతంలో శబ్ద కాలుష్యం పెరగడమే కాకుండా, డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో ఎక్కువ మంది వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, విద్యార్థులు నివసిస్తున్నారని అక్రమ నిర్మాణాల వల్ల వారి ఆరోగ్యం మరియు భద్రతకు ముప్పు వాటిల్లుతోందని నివాసితులు తెలిపారు. స్థానికులు వెళ్లి సదరు యజమానిని వారించినా, ఆయన మొండిగా వ్యవహరిస్తూ పనులు కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు యజమాని గత మూడేళ్లుగా వాటర్ మీటర్ లేకుండానే అక్రమంగా నీటి సరఫరా పొందుతున్నారని, అలాగే విద్యుత్ కనెక్షన్లు కూడా నిబంధనల ప్రకారం లేవని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, ఈ అక్రమ వాణిజ్య కేంద్రాన్ని అడ్డుకోవాలని, కాలనీలో ప్రశాంతతను కాపాడాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## వందేళ్ల చరిత్ర సీపీఐకి మాత్రమే సొంతం: కొన్నె లక్ష్మయ్య



ఇది కద నిజం, కుక్కునూరు: వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే అని కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కుక్కునూరు మండలంలో సోమవారం గ్రామాల్లో గడప గడపకు సీపీఐ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బెస్తగూడెం, సీతారామనగరంలో ఇంటింటికి తిరిగి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కార కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. సుదీర్ఘమైన పార్టీ ప్రయాణంలో ఎన్నో సమస్యల కోసం పోరాటం చేశామన్నారు . ఈ కార్యక్రమంలో మడిపల్లి రమణయ్య, వరసా పాపారావు, కోమళ్ళ కాశీ, బసవరాజుల మహేష్, సోయం హరిక్రిష్ణ, వరసా సూర్యకిరణ్, గుంటుపల్లి రాజేష్ పాల్గొన్నారు.

## నవాబుపేటలో ఘనంగా
# బిజెపి 30 ఫీట్ల జెండా ఆవిష్కరణ
### : పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




ఇది కద నిజం :నవాబుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 30 ఫీట్ల భారీ జెండాను ఆవిష్కరించారు. బిజెపి మండల అధ్యక్షులు చంద్రకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ రత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు ఎల్లకొండ జాతరలో భాగంగా శ్రీ పార్వతీ పరమేశ్వర దేవిని దర్శించుకున్న అనంతరం, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా మండల కేంద్రానికి చేరుకుని పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని, సిద్ధాంతాలతో పాటు రాజ్యాధికారం కూడా ప్రజా రంజక పాలనకు ఎంతో అవసరమని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచులు నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అప్పులు తీర్చలేక తెల్లవారుజామునే కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సర్పంచులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద కూడా నిధులు లేవని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్రం నడుస్తోందని ఆయన స్పష్టం చేశారు. కుటుంబ పాలనపై విమర్శలు చేస్తూ కారు గుర్తు పార్టీ తండ్రి కొడుకుల కోసమేనని, కాంగ్రెస్ వారు గాంధీ పేరుతో దేశాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేవలం ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం 2047 నాటికి నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలుస్తున్నది మోదీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రజా సేవలో భాగంగా తన సొంత నిధులతో రోడ్డు వేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే, పాఠశాలల్లో పరిశుభ్రత కోసం తన సొంత సంస్థ ద్వారా బాత్రూమ్ క్లీనింగ్ ట్రక్కును ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కో-కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, జిల్లా నాయకులు జగన్, గాలయ్య, సర్పంచులు శేఖర్, మల్లేశం, చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, భీమ్ రెడ్డి, ఉపసర్పంచులు రాజశేఖర్ రెడ్డి, ధీరత్ రెడ్డి, అర్జున్, ఇతర సీనియర్ నాయకులు, అనుబంధ మోర్చా ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి, రాహుల్ గాంధీ పర్యటన వేళ
# బీవీహెచ్పీఎస్ నేతల అరెస్టు
**వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ ఆగ్రహం**




ఇది కద నిజం, వికారాబాద్ :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వికారాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (BVHPS) నేతలను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడం జిల్లాలో కలకలం రేపింది. ఈ ముందస్తు అరెస్టులను సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ తీవ్రంగా ఖండించారు. వికలాంగుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న తమ నేతలను అక్రమంగా నిర్బంధించి స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన మండిపడ్డారు.

ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ బంట్వారంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, దారూర్ మండలంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరిజన్ బాలరాజ్, మరియు దోమ మండలంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్యలను అర్ధరాత్రి వేళ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ పోలీసులను ప్రయోగించి తమను నిర్బంధిస్తోందని ఆయన విమర్శించారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు బీవీహెచ్పీఎస్ నేతలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వికలాంగుల హక్కుల సాధనకై తమ పోరాటం ఆగదని సుధీర్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించని పక్షంలో, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నవాబుపేటలో దారుణం గుర్తు తెలియని
# మహిళ గొంతుకోసి హత్య



ఇది కద నిజం ,నవాబుపేట: మండల పరిధిలోని మైతబ్ ఖాన్ గూడ గ్రామ సమీపంలో గల పులికుంట గుట్ట వద్ద ఉన్న ఒక వెంచర్‌లో గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. నిన్న(ఆదివారం )రాత్రి దుండగులు ఆమె గొంతు కోసి హత్య చేయడమే కాకుండా, ఆమె మెడలో ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. కూలీల గుర్తింపు - పోలీసుల రంగప్రవేశం: ఉదయం సదరు వెంచర్‌లో పని చేసేందుకు వచ్చిన కూలీలు రక్తపు మడుగులో పడి ఉన్న మహిళా మృతదేహాన్ని చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే వారు సమీపంలో ఉన్న వ్యక్తులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మరియు పరిసరాలను నిశితంగా పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఘటనా స్థలం వద్ద ఒక కత్తెర లభ్యమైంది. ఈ కత్తెరతోనే దుండగులు మహిళ గొంతు కోసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి వయస్సు సుమారు 40 నుండి 45 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు. దుండగులు నగలు దోచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ హత్యకు పాల్పడ్డారా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చింది? అనే పూర్తి వివరాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరిస్తున్నారు.

## హరి చరణ్ గౌడ్‌ను పరామర్శించిన

# మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



ఇది కద నిజం ,రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం బుద్వేల్‌కు చెందిన బిఆర్ఎస్ నాయకుడు హరి చరణ్ గౌడ్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం మలేషియా పర్యటన ముగించుకుని తిరిగి వస్తుండగా, శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో హరి చరణ్ గౌడ్ కాలికి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న హరి చరణ్ గౌడ్‌ను శ్రీనివాస్ గౌడ్ స్వయంగా కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయం తీవ్రత గురించి, అందుతున్న వైద్యం గురించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెబుతూ, వైద్యుల సూచనల మేరకు సరైన చికిత్స తీసుకుంటూ కొద్దిరోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ హరి చరణ్ గౌడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి క్షేమంగా ప్రజా జీవితంలోకి రావాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు తప్పవు

## - సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్




ఇది కద నిజం, కుక్కునూరు: మండలంలోని ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇప్పటికే పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లామని, ఇకనైనా వాటిని పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవు అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి, ఆ తర్వాత తహశీల్దార్ రమేష్ బాబుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ.. కుక్కునూరు మెయిన్ సెంటర్‌లో ఆర్ అండ్ బి పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి షాపులు నిర్మించడంతో ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆటోలను రోడ్లపై నిలపాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. షాపుల ముందు ఆటోలను నిలిపితే వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేయడం వల్ల డ్రైవర్లు అవమానాలకు గురవుతున్నారని అన్నారు. ప్రయాణికులు ఎక్కే దిగే స్థలం లేక ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కారణంగా ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. అక్రమంగా నిర్మించిన షాపులను తక్షణమే తొలగించి, ఆటో కార్మికులకు పికపింగ్ డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సీఐటీయూ కో- కన్వీనర్ మహమ్మద్ వలిపాషా, ఆటో యూనియన్ అధ్యక్షులు దార కృష్ణ, కార్యదర్శి పోచారపు వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీను, లారీ యూనియన్ కోశాధికారి ఓగిరాల నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు రాంప్రసాద్, వీరబాబు, యడ్ల సాగర్, మనోజ్, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ కంప్లైంట్లో లవ్ సాంగ్ విడుదల



వరలక్ష్మి శరత్ కుమార్ , నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రంలోని మెలోడియస్ లవ్ సాంగ్ 'ప్రేమ ఓ ప్రేమ' విడుదలైంది. సీనియర్ జర్నలిస్టు ప్రభు ఈ పాటను లాంచ్ చేశారు.

సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్నారు. సుధాకర్ మారియో సంగీతం అందించిన ఈ పాట యూత్‌ను ఆకట్టుకుంటుందని దర్శకుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

యాక్షన్, కామెడీ, రొమాన్స్ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో రాగిణి ద్వివేది తదితరులు కీలక పాత్రలు పోషించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఉగాదికి ప్రత్యేక గ్లింప్స్‌తో!

ఈ సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఇప్పుడు 'విశ్వంభర'తో మరోమారు ప్రేక్షకుల్ని పలకరించేందుకు సమాయత్తమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. వీఎఫ్‌ఎక్స్ పనుల వల్ల ఆలస్యమవుతూ వచ్చిన ఈ చిత్రం.. ఇప్పుడు అన్నీ ఓ కొలిక్కి వస్తుండటంతో విడుదల తేదీ ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం చిత్ర బృందం ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దీన్ని మార్చిలో ఉగాది సందర్భంగా విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇది ఆధ్యాత్మిక అంశాలతో నిండిన ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్. 14 లోకాలతో ముడిపడిన కథగా ఉంటుంది. ఈ చిత్రానికి ఎం.ఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. ఛోటా కె నాయుడు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# సువర్ణ టెక్స్టైల్స్

## టీజర్ విడుదల



శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్రల్లో ప్రశాంత్ నామిని దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ "సువర్ణ టెక్స్టైల్స్" టీజర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో దర్శకుడు వేణు ఉడుగుల విడుదల చేశారు. ఈ చిత్రాన్ని ఎ.వై.వి. ప్రొడక్షన్స్, సనాతన క్రియేషన్స్ బ్యానర్లపై అనీల్ ఈరుగుదిండ్ల నిర్మిస్తున్నారు.

టీజర్ ఆకట్టుకునే విధంగా ఉందని, సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుందని వేణు ఉడుగుల అభినందించారు. హీరో శివకుమార్ మాట్లాడుతూ దర్శకుడు ప్రశాంత్ నామిని ఎంతో ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారని, యూత్‌కు బాగా నచ్చేలా సినిమా ఉంటుందని తెలిపారు. హీరో సోహైల్ టీజర్ యువతను ఆకట్టుకుంటుందని అన్నారు.

దర్శకుడు ప్రశాంత్ నామిని మాట్లాడుతూ ఇది కొత్త జానర్‌లో తెరకెక్కిన చిత్రం అని, కొంత అడల్ట్ కంటెంట్ ఉన్నప్పటికీ కుటుంబంతో కలిసి చూడదగ్గ చిత్రమని చెప్పారు.


# ధనుష్ యాక్షన్ వేసవిలో



వైవిధ్యమైన కథలతో దర్శకుడిగా, కథానాయకుడిగా సినీప్రియుల్ని అలరిస్తుంటారు ధనుష్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కర'. "ఈ ఆటలో అందరూ దోషులే.. కానీ కారణాలే వేర్వేరు" అంటూ ఇటీవలే ఈ చిత్రాన్ని ప్రకటించా రాయన. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. ఐషారి కె. గణేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ చిత్రాన్ని వేసవి సందర్భంగా ఏప్రిల్ 30న థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. "గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ధనుష్ రైతు పాత్రలో సరికొత్తగా కనిపించనున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా ఉంటుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రంలో జయరామ్, కేఎస్ రవికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఛిల్ అవుట్ మూడ్‌లో

# ఉస్తాద్ భగత్ సింగ్..




పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి కొత్త లుక్ విడుదలైంది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది.

తాజా స్టిల్‌లో పవన్ కల్యాణ్ చైర్‌పై కూర్చొని ఛిల్ అవుట్ మూడ్‌లో కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు, గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది.

'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కల్యాణ్‌హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమాను మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.